రెచ్చిపోతున్న రౌడీమూకలు




- పామిడిలో శాంతిభద్రతలు కరువు
- పట్టించుకోని పోలీసులు

పామిడి: పామిడిలో సినిమా ఫక్కీలో గ్రూపుల ఆధిపత్యం ఎక్కువైంది. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక పామిడిలో శాంతిభద్రతలు కరువయ్యాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా యువత గ్రూపులుగా ఏర్పడి మద్యం తాగి రౌడీయిజం చెలాయిస్తున్నారు. మారణాయుధాలు, తుపాకులతో ఒక గ్రూపు, మరో గ్రూపుపై ఆధిపత్యాన్ని చెలాయిస్తూ సినిమాలను తలపింపజేస్తున్నారు. నిత్యం ఏదో ఒక చోట వారు గొడవలు జరుగుతున్నాయి.

ధూల్‌పేటను తలపిస్తున్న 'సంతమార్కెట్ వీధి'

హైదరాబాద్‌లో రౌడీలకు కేరాఫ్ దూల్‌పేట. అలాంటి కోవలోకి ప్రస్తుతం పామిడి సంతమార్కెట్ వీధి చేరింది. ఇక్కడ ఆధిపత్య పోరులో రెండు వేర్వేరు సామాజిక వర్గాలకు చెందిన యువత రెండు గ్రూపులుగా ఏర్పడి రౌడీ దందాకు శ్రీకారం చుట్టారు. ఏదో ఒక చోట ఈ రెండు గ్రూపులు తలపడతుండడంతో శాంతిభద్రతలకు విఘాతం కలుగుతోంది.

రౌడీగ్రూపులకు ప్రజాప్రతినిధుల అండ

కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక రౌడీగ్రూపులకు ప్రాచుర్యం సంతరించుకుంది. ముఖ్యంగా అధికారపార్టీ ప్రజాప్రతినిధులు ఈ రెండు గ్రూపులను తమ అక్రమ దందాకు పావులుగా వాడుకుంటున్నారన్న ఆరోపణలు ప్రజల నుంచి గుప్పుమంటున్నాయి. వారి జల్సాలను ఆసరాగా తీసుకొని వారికి అవసరమొచ్చినట్లుగా ఈ రెండు గ్రూపులను ఆ ప్రజాప్రతినిధులు వాడుకుంటూ పావులు కదుపుతున్నారన్న విమర్శలు లేకపోలేదు. ఇసుక, గరుసు అక్రమ రవాణా, ప్లాట్లు, స్థల సెటిల్‌మెంట్లు ఇతరత్రా దందాల్లో ఈ రౌడీమూకలతో బెదిరింపులకు గురిచేస్తూ ప్రజాప్రతినిధులు, నాయకులు యథేచ్ఛగా తమ అక్రమ దందాను కొనసాగిస్తున్నారన్న ఆరోపణలు షికార్లు కొడుతున్నాయి.

రౌడీమూకలను అరికట్టడంలో పోలీసులు వైఫల్యం

పామిడిలో రౌడీమూకల అల్లర్లతో ప్రజాశాంతికి తీవ్ర విఘాతం కల్గుతోంది. అరికట్టాల్సిన పోలీసులు పూర్తిగా వైఫల్యం చెందారన్న తీవ్ర విమర్శలు ప్రజల నుంచి వ్యక్తమవుతున్నాయి. అధికారపార్టీ నేతల అండదండలు పుష్కలంగా ఉన్న ఈ గ్రూపుల రౌడీ దందాను అరికట్టడంలో పోలీసులు పూర్తిగా చేతులెత్తేశారని తెలుస్తోంది. దీనికితోడు రౌడీషీటర్లను స్టేషన్‌కు పిలిపించి కౌన్సిలింగ్ ఇచ్చే పోలీసులే కరువయ్యారు. దీంతో వారు... ఆడిందే...ఆట...పాడిందే...పాట అయ్యింది. పోలీసులు అంటే ఏమాత్రం భయం లేకుండా ఆ రౌడీమూక ఏదో ఒకచోట మారణాయుధాలు, తుపాకులతో రెచ్చిపోతూ సోషల్ మీడియాల్లో హల్‌చల్ చేస్తుండడం ప్రశాంత పామిడి ప్రజలను తీవ్ర విఘాతంలోకి నెట్టేస్తోంది. శాంతిభద్రతలను పరిరక్షించాల్సిన పోలీసులు తమ విధ్యుద్ధర్మాన్ని సక్రమంగా నిర్వర్తిస్తూ ప్రజాశాంతికి విఘాతం లేకుండా చూడాల్సిన అవసరమెంతైనా ఉంది.

ఇటీవల చోటుచేసుకున్న సంఘటనలు ఇలా..

- అక్టోబర్ 18: హైవేలోని తన కాంపౌండ్ స్థలంలో నిలుపుకున్న పెద్ద నరసింహుడుకు చెందిన రెండు టిప్పర్ల అద్దాలను రౌడీమూక దాడి చేసి ధ్వంసం చేసింది.
- అక్టోబర్ 26: హైవేపై ఓ స్థల వివాదంలో తంబళ్లపల్లి శ్రీనివాసరెడ్డి సోదరుడిపై కొందరు భౌతికదాడికి పాల్పడ్డారు.
- నవంబర్ 8: కొత్త బస్టాండ్ వద్ద మారణాయుధాలతో, తుపాకీతో ఓ గ్రూపుకు చెందిన ఓ యువకుడిపై మరో గ్రూపు వారు దాడికి పాల్పడడంతో అప్రమత్తమై యువకుడు పరారయ్యాడు.
- డిసెంబర్ 9: పీ కొండాపురం క్రాస్ వద్ద పెట్రోలు బంకు వద్ద జరిగిన తగాదాలో ఓ యువకుడిపై రౌడీమూక తుపాకీతో భౌతికదాడులకు పాల్పడింది.
- డిసెంబర్ 22: పామిడి భోగేశ్వరాలయ ప్రధాన అర్చకుడు దేవగుడి రామేశ్వరశర్మ కారు అద్దాలు రౌడీమూక ధ్వంసం చేసింది.


కొత్తబస్టాండ్ వద్ద రౌడీమూక హల్‌చల్ చేస్తున్న దృశ్యం (ఫైల్)


టిప్పర్ అద్దాలను పగులగొట్టిన రౌడీమూక (ఫైల్)


భోగేశ్వరాలయ ప్రధాన అర్చకుడు రామేశ్వరశర్మ కారు అద్దాలు పగులగొట్టిన దృశ్యం (ఫైల్)

కేసులు నమోదు చేశాం



పామిడిలో శాంతిభద్రతలే ధ్యేయంగా పోలీసులు పనిచేస్తున్నాం. రౌడీమూకల గురించి సమాచారం అందిన వెంటనే సంఘటనా స్థలానికి వెళ్లి నిందితులను స్టేషన్‌కు తరలిస్తున్నాం. కేసులు సైతం నమోదు చేసి విచారణ చేస్తున్నాం. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే అల్లరి మూకపై ప్రత్యేక దృష్టి సారించాం. ప్రజాశాంతికి విఘాతం కల్గించే రౌడీషటర్ల బహిష్కరణకు చర్యలు చేపట్టేందుకు వెనుకాడం. –వీ యుగంధర్, సీఐ

క్లుప్తంగా

మహిళలపై దాడులు అరికడదాం


ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

గుంతకల్లుటౌన్: మహిళలపై జరుగుతున్న దాడులను అరికట్టి, వారికి రక్షణ కల్పించాల్సిన బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఉందని ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి ఓతూరు పరమేష్ అన్నారు. ఎస్ఎఫ్ఐ 55 వసంతాల సందర్భంగా సోమవారం పట్టణంలో విద్యార్థులతో భారీ ర్యాలీ నిర్వహించారు. డ్రగ్స్‌ను నివారిద్దాం.. నవ సమాజాన్ని నిర్మిద్దామని నినదించారు. కూటమి ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన జాతీయ విద్యా విధానాన్ని రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు వెంకటేష్, సహాయ కార్యదర్శి భీమేష్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

హెల్మెట్ వాడకంపై అవగాహన


బైక్ ర్యాలీ చేస్తున్న పోలీసులు

తాడిపత్రి రూరల్: మోటర్ సైకిల్‌ను నడిపే ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని డీఎస్పీ రామక్రిష్ణుడు సూచించారు. అప్‌గ్రేడ్ పోలీసు స్టేషన్ వద్ద సోమవారం హెల్మెట్ వాడకంపై ప్రజల్లో అవగాహన కల్పించడానికి బైక్ ర్యాలీ ప్రారంభించారు. డీఎస్పీ మాట్లాడుతూ హెల్మెట్ లేకుండా మోటర్ సైకిళ్లను నడపడం వల్ల జరిగే ప్రమాదాల్లో ఎక్కువ మంది చనిపోతున్నారన్నారు. హెల్మెట్ ధరించడం వల్ల ప్రాణాలకు ముప్పు ఉండదన్నారు. పట్టణ, అప్‌గ్రేడ్ పోలీసు అధికారులు, సిబ్బంది, బైక్ షోరూంల సిబ్బంది పాల్గొన్నారు.

మెరుగైన సేవలు అందించాలి


పోస్టాఫీసును తనిఖీ చేస్తున్న ఆర్ఏడీ

యాడికి: పోస్టాఫీసుకు వచ్చే ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని పోస్టల్ రీజనల్ అసిస్టెంట్ డైరెక్టర్ వెంకటరెడ్డి సూచించారు. సోమవారం మండలంలోని రాయలచెరువు సబ్ పోస్టాఫీసును ఆయన ఆకస్మిక తనిఖీ చేసి, రికార్డులు పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ పోస్టాఫీసులో పొదుపు ఖాతా, ఇన్సూరెన్స్ పాలసీలు, పోస్టల్ బ్యాంకు సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పోస్టుమాస్టర్ నిరంజన్‌రెడ్డి, ప్యాకర్ మహబూబ్ బాషా, అరుణ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

సీఐపై చర్యలు తీసుకోవాలి


కోర్టు ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న న్యాయవాదులు

తాడిపత్రి అర్బన్: లాయర్ శేషాద్రి మృతికి కారణమైన అనంతపురం త్రీటౌన్ సీఐపై చర్యలు తీసుకోవాలని తాడిపత్రి బార్ అసోసియేషన్ డిమాండ్ చేసింది. సోమవారం స్థానిక కోర్టు ఎదుట బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు తమ విధులను బహిష్కరించి నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో తాడిపత్రి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రామాంజులరెడ్డి, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు, సీనియర్ న్యాయవాదులు దద్దం సుబ్బయ్య, మునయ్య, రజనీకాంత్‌రెడ్డి, శివయ్య, కుమార్‌స్వామి తదితరులు పాల్గొన్నారు.

చేప పిల్లల విడుదల


మిడ్ పెన్నార్ డ్యాంలో చేప పిల్లలు విడుదల చేస్తున్న ఎమ్మెల్యే బండారు శ్రావణి

గార్లదిన్నె: మండలంలోని మిడ్ పెన్నార్ డ్యాంలో సోమవారం ప్రధానమంత్రి మత్స్యసాగు యోజన , మిషన్ ఫిషరింగ్స్ పథకాల ద్వారా 12 లక్షలు చేపపిల్లలు విడుదల చేశారు. శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ ముఖ్య అతిథిగా హాజరై చేప పిల్లలు నీటిలో వదిలారు. ఎమ్మెలే మాట్లాడుతూ మత్స్యకారులు డ్యాంలు చేపలు పట్టుకుని ఆర్థికంగా ఎదగాలన్నారు. కార్యక్రమంలో సర్పంచు ఉషారాణి, మాజీ ఎంపీపీ శ్రీనివాసుల రెడ్డి, టీడీపీ మండల కన్వీనర్ పాండు, డిస్ట్రిబ్యూటరీ చైర్మన్ చంద్రశేఖర్‌నాయుడు, మత్స్య శాఖ జిల్లా అధికారి శ్రీనివాసు నాయక్, తహసీల్దార్ ఈరమ్మ, ఎంపీడీఓ యోగానందరెడ్డి, మత్స్యశాఖ అభివృద్ధి అధికారి ఆసీఫ్ తదితరులు పాల్గొన్నారు.

ముస్లిం, మైనార్టీ పాఠశాల తనిఖీ

గార్లదిన్నె: మండలంలోని ముస్లిం,మైనార్టీ గురుకుల పాఠశాలను సోమవారం ఎమ్మెల్యే శ్రావణిశ్రీ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పనితీరు సరిగాలేని ఉపాధ్యాయులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆమె మాట్లాడుతూ పాఠశాలలో వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటామన్నారు. ప్రిన్సిపాల్ ఆంజనేయులు నాయక్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎస్సీ కులగణన జాబితా ప్రదర్శన


జాబితా చూపుతున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

పెద్దవడుగూరు: మండలంలోని అన్ని రెవెన్యూ గ్రామ ప్రంచాయతీ కార్యాలయాల్లో సోమవారం ఎస్సీ కుల గణన జాబితా ప్రదర్శించినట్లు తహసీల్దార్ ఉషారాణి తెలిపారు. పెద్దవడుగూరు గ్రామ సచివాలయంలో ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు కత్తుల కొండయ్య, మండల అధ్యక్షుడు గూడూరు రంగస్వామి ఆ జాబితాను పరిశీలించారు. మండలంలోని అన్ని గ్రామ పంచాయితీల్లోని జాబితా ను చూస్తామని, ఏమైనా తప్పులు ఉంటే నిరసన కార్యక్రమం చేపడతామన్నారు. కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు ఆంజనేయులు, నాయకులు లాలెప్ప, లింగన్న, రామాంజినేయులు తదితరులు పాల్గొన్నారు.

అభ్యంతరాలుంటే తెలపండి

గుంతకల్లు: గుంతకల్లు అర్బన్, రూరల్ ఏరియాల్లో ఎస్సీ కులగణన పూర్తయిందని, అభ్యంతరాలు ఉంటే మీ పరిధిలోని సచివాలయాల్లో వ్యక్తం చేయాలని తహసీల్దార్ రమాదేవి సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. గుంతకల్లు అర్బన్ పరిధిలోని 35 సచివాలయాల్లో 23,165 మంది, గుంతకల్లు రూరల్ పరిధిలో 6,088 మంది మొత్తం 29253 మంది ఎస్సీలు ఉన్నట్లు గుర్తించమన్నారు. అభ్యంతరాలు వ్యక్తం చేసేందుకు మంగళవారం మాత్రమే అవకాశం ఉందన్నారు.

కాలనీలో మౌలిక వసతులు కల్పించండి


మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న మహిళలు

గుత్తి: జెడ్ వీరారెడ్డి కాలనీలో మౌలిక వసుతులు కల్పించాలని డిమాండ్ చేస్తూ కాలనీవాసులు సీపీఎం ఆధ్వర్యంలో సోమవారం మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. సీపీఎం మండల కార్యదర్శి నిర్మల, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యులు రమేష్ , రామకృష్ణ కాలనీవాసులతో కలసి మాట్లాడారు. కాలనీలో తాగునీరు, రోడ్లు, వీధి దీపాలు తదితరర సమస్యలు నెలకొన్నాయన్నారు. ఎన్నిసార్లు మున్సిపల్ అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదన్నారు. మౌలిక వసతులు కల్పించకపోతే ఆందోళనలు మరింత తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రం మున్సిపల్ కమిషనర్ జబ్బార్ మియాకు అందజేశారు.

మిత్రుల కుటుంబాలకు చేయూత


మిత్రుడికి నగదు అందజేస్తున్న దృశ్యం

నార్పల: అనారోగ్యంతో బాధపడుతున్న మిత్రుల కుటుంబాలకు స్నేహితులు అండగా నిలిచారు. స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో 2002–03లో పదో తరగతి చదివిన విద్యార్థులు తమ మిత్రుడు పుల్లయ్య డయాలసిస్‌తో బాధపడుతుండడంతో రూ.లక్ష నగదు అందించారు. అలాగే మరో మిత్రుడు సుబ్రమణ్యం రోడ్డు ప్రమాదంలో గాయపడడంతో వైద్య ఖర్చుల నిమిత్తం రూ.20 వేలు నగదు అందించి మానవతా దృక్పథం చాటుకున్నారు.

పాఠశాలకు ఆర్థికసాయం


అభివృద్ధి పనులు చేయిస్తున్న బయాలజీ టీచర్

యాడికి: మంగళవారం పదవీ విరమణ చేయబోతున్న బయాలజీ ఉపాధ్యాయురాలు పాఠశాలలో అభివృద్ధి పనులకు రూ.60 వేలు ఆర్థిక సాయం అందించటం అభినందనీయమని యాడికి ఉన్నత పాఠశాల హెచ్ఎం నాగన్న అన్నారు. ఆయన మాట్లాడుతూ పాఠశాలలోని ఉపాధ్యాయుల కోసం ఆమె సోమవారం రూ.60 వేలతో వాష్ బేసిన్, వాకిలికి ఇనుప గ్రిల్ ఏర్పాటు చేయించారన్నారు. ఈ సందర్భంగా ఆమెను ఉపాధ్యాయులు విశ్వనాథ్, రవికుమార్, బాలయ్య అభినందించారు.

'అమిత్‌షాను మంత్రి పదవి నుంచి తొలగించాలి'

తాడిపత్రి అర్బన్/గుంతకల్లు టౌన్/గుత్తి/శింగనమల/బుక్కరాయసముద్రం/పామిడి/గార్లదిన్నె: అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోం మంత్రి అమిత్‌షాను మంత్రి వర్గం నుంచి బర్తరఫ్ చేయాలని సీపీఐ, సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం తాడిపత్రిలోని అంబేడ్కర్ సర్కిల్‌లో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించాయి. ఈ సందర్భంగా సీపీఐ నాయకుడు రంగయ్య, సీపీఎం నాయకుడు జగన్మోహన్‌రెడ్డి మాట్లాడుతూ పార్లమెంటు సమావేశాల్లో అంబేడ్కర్‌పై కేంద్ర హోంమంత్రి అమిత్‌షా అవమానకరంగా మాట్లాడటం సిగ్గు చేటన్నారు. బీజేపీకి అంబేడ్కర్, రాజ్యాంగం పట్ల ఏమాత్రం గౌరవం లేదన్న విషయం అమిత్‌షా వ్యాఖ్యలతో రుజువైందన్నారు. అలాగే హోం మంత్రి అమిత్‌షాను కేంద్ర మంత్రి పదవి నుంచి తొలగించాలని గుంతకల్లులో నిరసన ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి వీరభద్రస్వామి, సీపీఎం పట్టణ కార్యదర్శి మారుతి, న్యూడెమోక్రసీ పార్టీ నాయకుడు జిలాన్, కేవీపీఎస్ డివిజన్ కార్యదర్శి జగ్గిలి రమేష్, సీపీఎం నాయకులు రమేష్, నాగరాజు, రంగమ్మ, సీపీఐ పట్టణ, మండల కార్యదర్శులు గోపినాథ్, రాము, గౌస్, న్యూడెమోక్రసీ నాయకులు జిలాన్, మహబూబ్‌బాషా పాల్గొన్నారు. గుత్తిలో నిర్వహించిన ధర్నాలో సీపీఎం మండల కార్యదర్శి నిర్మల, మాజీ కార్యదర్శి రామకృష్ణ, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు రమేష్, బీఎస్పీ నాయకులు గద్దల నాగభూషణం, విజయ్, కేవీపీఎస్ మండల అధ్యక్షుడు మల్లికార్జున, మాల మహానాడు నాయకులు రామాంజనేయులు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకుడు మద్దిలేటి పాల్గొన్నారు. అలాగే శింగనమలలో నిర్వహించిన ర్యాలీలో సీపీఎం నియోజకవర్గ సమితి సభ్యుడు భాస్కర్, నాయకులు కొండారెడ్డి, రామాంజినేయులు, శ్రీనివాసులు, కుళ్లాయిస్వామి, నాగేంద్ర, రాజేష్ పాల్గొన్నారు. బుక్కరాయసముద్రంలో సీపీఎం మండల కార్యదర్శి కుళ్లాయప్ప, నాయకులు శివారెడ్డి, సంజీవరెడ్డి, వెంకట కొండ, నాగేంద్ర, చెన్నప్ప, చంటి తదితరులు అంబేడ్కర్ విగ్రహం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. అదేవిధంగా పామిడిలో నిర్వహించిన ర్యాలీలో వామపక్షనేతలు పీ అనిమిరెడ్డి, కే రహీమ్ సూర్యనారాయణరెడ్డి, నాగరాజు, శ్రీనివాసులు, మల్లేసు, ముత్యాలు, చంద్రమోహన్‌రెడ్డి, పాల్గొన్నారు. గార్లదిన్నెలో నిర్వహించిన నిరసనలో సీపీఎం మండల కార్యదర్శి చెన్నారెడ్డి, నల్లప్ప, మల్లికార్జున, వెంకటరాముడు, రాము పాల్గొన్నారు.

పెన్షనర్లు లైఫ్ సర్టిఫికెట్లను అందజేయాలి

తాడిపత్రి అర్బన్: పెన్షనర్లు తమ లైఫ్ సర్టిఫికెట్లను ఎస్టీఓ కార్యాలయంలో సమర్పించేందుకు జనవరి, ఫిబ్రవరి నెలలు కేటాయించామని, ట్రెజరీ కాంపౌండులోని ఎన్జీఓ హోమ్‌లో పెన్షనర్స్ ఫారాలను జనవరి 31లోపు సమర్పించాలని అసోసియేషన్ అధ్యక్షుడు సత్యప్రసాద్‌రెడ్డి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇందుకోసం ప్రతి ఒక్క పెన్షనర్ తమ పాస్ ఫొటో, ఆధార్‌కార్డు జిరాక్స్, బ్యాంక్ అకౌంట్ జిరాక్స్ కాపీలతో పాటు సీఎఫ్ఎంఎస్ నంబరును అందజేయాలని కోరారు. ప్రతి ఒక్కరూ మొబైల్ ఫోన్ తీసుకురావాలని ఆయన కోరారు.

నేడు కౌన్సిల్ సమావేశం

తాడిపత్రి రూరల్: స్థానిక మునిసిపల్ కార్యాలయంలో మంగళవారం కౌన్సిల్‌మీట్ ఏర్పాటు చేశామని కమిషనర్ శివరామక్రిష్ణ సోమవారం తెలిపారు. సమావేశానికి సభ్యులు, కో–ఆప్షన్ మెంబర్లు హాజరు కావాలని ఆయన కోరారు.

గుత్తి: పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం మున్సిపల్ కౌన్సిల్ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు కమిషనర్ జబ్బార్ మియా తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఉదయం 11 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందన్నారు. మున్సిపల్ అధికారులు, పాలక వర్గం సభ్యులు తప్పకుండా హాజరుకావాలని ఆయన కోరారు.

సంక్షిప్త సమాచారం

ఈ–కేవైసీ చేయించుకోండి

గుంతకల్లు: పట్టణ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో ఓటు హక్కు కలిగిన ప్రతి ఒక్కరూ ఈ–కేవైసీ చేయించుకోవాలని ఇన్‌చార్జ్ టీ పూర్ణిమ, సంఘం సీఈఓ కుళ్లాయిపీరా సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ–కేవైసీ చేయించకపోతే ప్రభుత్వ నుంచే అందే ఇన్‌పుట్ సబ్సిడీ, ఇన్సూరెన్స్, వడ్డీలకు అనర్హులవుతారు.

వ్యక్తి మృతి

యాడికి: మండలంలోని కోన రోడ్డులో ఈ నెల 23న జరిగిన ప్రమాదంలో గాయపడి కర్నూలులో చికిత్స పొందుతున్న వ్యక్తి సోమవారం మృతి చెందాడు. పోలీసుల వివరాల మేరకు.. మండల కేంద్రానికి చెందిన చెన్నమయ్య(73) ఈ నెల 23న ద్విచక్ర వాహనంలో ఓబుళాపురం వద్ద ఉన్న తన తోటకు వెళ్తుండగా కత్తిమానుపల్లి వద్ద మరో బైక్ ఢీ కొంది. ఘటనలో తీవ్రంగా గాయపడిన చెన్నమయ్యను యాడికి ప్రభుత్వాస్పత్రికి తరలించారు మెరుగైన వైద్యం కోసం చెన్నమయ్యను కర్నూలుకు తరలించగా.. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం మధ్యాహ్నం మృతి చెందాడు. అతడి భార్య నాగలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. వారికి నలుగురు కొడుకులు, ముగ్గురు కూతుళ్లు ఉన్నారు.

యూటీఎఫ్ క్యాలెండర్, డైరీ విడుదల

బుక్కరాయసముద్రం: ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యూటీఎఫ్) క్యాలెండర్, డైరీని సోమవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎంఈఓలు నవీద, లింగానాయక్ మాట్లాడుతూ యూటీఎఫ్ నేతలు ఉపాధ్యాయల సమస్యలు పరిష్కారానికి కృషి చేయాలన్నారు. యూటీఎఫ్ సంఘం గౌరవాధ్యక్షుడు రమణయ్య మాట్లాడుతూ కాకినాడలో జనవరి 5 నుంచి 8వ తేదీ వరకు నిర్వహించే 17వ వైజ్ఞానిక స్వర్ణోత్సవ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలన్నారు. యూటీఎఫ్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శిలు మహమ్మద్ గౌస్, పవన్‌కుమార్. నాయకులు సీతారామిరెడ్డి, హెన్రీమార్కు, శివప్రసాద్, క్రిష్ణమూర్తి, లక్ష్మిరెడ్డి, కలీముల్లా, ప్రసాద్, రెడ్డప్ప, చాంద్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతగా విధులు నిర్వర్తించాలి

గుత్తి: విధులను బాధ్యతగా, సక్రమంగా నిర్వర్తించాలని సీడీపీఓ ఢిల్లీశ్వరి అంగన్‌వాడీ కార్యకర్తలను ఆదేశించారు. పట్టణంలోని ఐసీడీఎస్ కార్యాలయంలో సోమవారం గుత్తి, గుత్తి రూరల్, పామిడి సెక్టార్లకు చెందిన అంగన్‌వాడీ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ నాగేశ్వరితో కలిసి సీడీపీఓ మాట్లాడారు. పిల్లలు, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం సక్రమంగా పంపిణీ చేయాలన్నారు. సిబ్బంది సమయపాలన పాటించాలన్నారు. లేకుంటే చర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు.

న్యూ ఇయర్ వేడుకల్లో నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

బుక్కరాయసముద్రం: న్యూయర్ వేడుకల సందర్భంగా 31న రాత్రి ఎవరైనా నిబంధనలు ఉల్లంగిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని మండల సీఐ కరుణాకర్ అన్నారు. సోమవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో సీఐ కరుణాకర్ విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రతి ఒక్కరూ ఇతరులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా న్యూఇయర్ వేడుకలు చేసుకోవాలన్నారు. రహదారుల్లో రాత్రి పూట మద్యంతాగి నృత్యాలు తొక్కుతూ, ద్విచక్ర వాహనాలకు సైలెన్సర్లు తీసి ర్యాష్‌గా డ్రైవింగ్ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. రోడ్లపై కేక్ కటింగ్ చేయకూడదన్నారు. మండల కేంద్రంలో రాత్రి 8 గంటలకు మద్యం షాపులు, చికెన్ షాపులు బంద్ చేయాలన్నారు.

మట్కా, పేకాట నిర్వహిస్తే జైలుకే..

యల్లనూరు: మట్కా, పేకాట మహమ్మారిని తరిమి కొడతామని, ఎక్కడైనా మట్కా ఆడినా, రాసినా కఠిన చర్యలు తీసుకుంటామని పుట్లూరు సీఐ సత్యబాబు హెచ్చరించారు.సీఐ మాట్లాడుతూ మట్కా, పేకాటపై జిల్లా ఎస్పీ, డీయస్పీ సీరియస్‌గా ఉన్నారని, ఎంతటివారినైనా ఉపేక్షించేది లేదన్నారు. పోలీసులు ఎక్కడైనా అవినీతి, అక్రమాలకు పాల్పడితే శాఖాపరమైన చర్యలు తప్పవన్నారు.

డీఆర్ఎంను కలసిన సంఘ్ నాయకులు


నూతన డీఆర్ఎంతో ఎంప్లాయీస్ సంఘ్ నాయకులు

గుంతకల్లు: గుంతకల్లు రైల్వే డివిజనల్ మేనేజర్ (డీఆర్ఎం)గా బదిలీపై వచ్చిన చంద్రశేఖర్‌గుప్తాను దక్షిణ మధ్య రైల్వే ఎంప్లాయీస్ సంఘ్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. నూతన డీఆర్ఎం సోమవారం రిపోర్ట్ చేసుకున్నప్పటికీ పూర్తి స్థాయి బాధ్యతలను జనవరి 1వ తేదీ నుంచి స్వీకరించనున్నట్లు కార్యాలయ వర్గాలు తెలిపాయి. దీంతో ఎంప్లాయీస్ సంఘ్ గుంతకల్లు డివిజన్ ప్రధాన కార్యదర్శి కే.ప్రభాకర్ ఆధ్వర్యంలో నూతన డీఆర్ఎంను శాలవా, పూలమాలతో ఘనంగా సత్కారించారు. అదేవిధంగా ప్రసుత్త డీఆర్ఎం విజయ్‌కుమార్‌కు వీడ్కోలు పలికారు. కార్యక్రమంలో డివిజనల్ అధ్యక్షుడు బాబు, డీఫ్యూటీ డీఎస్ మల్లికార్జున, సీడబ్ల్యూసీ మెంబర్ కుళ్లాయప్ప, నాయకులు బాలకృష్ణ, సత్యనారాయణ పాల్గొన్నారు.

నైపుణ్యాభివృద్ధి శిక్షణకు పేర్లు నమోదు చేసుకోండి

గుంతకల్లుటౌన్: చేతి వృత్తులలో నైపుణ్యాభివృద్ధిని పెంపొందించేందుకు మెప్మా ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేయనున్నట్లు మున్సిపల్ కమిషనర్ నయీమ్ అహ్మద్, మెప్మా టీపీఆర్ఓ మోహన్ సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఒక కుటుంబ ఒక వ్యాపారవేత్త–వాక్ టు వర్క్ కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని డ్వాక్రా సంఘాల సభ్యులు, వారి కుటుంబసభ్యులెవరైనా హోం అప్లయెన్స్(ఏసీ, రిఫ్రిజిరేటర్, వాషింగ్ మిషన్,వాటర్ ప్యూరిఫైర్,గీజర్) మరమ్మతుల మెకానిక్‌లు, వడ్రంగి, ప్లంబింగ్, ఎలక్ట్రీషియన్, సెలూన్, బ్యూటీషియన్ వంటి పనులు చేస్తున్న వారు జనవరి 4వ తేదీలోగా మెప్మా ఆఫీసులో తమ పేర్లను నమోదు చేసుకోవాలని వారు కోరారు. ఇతర వివరాలకు 9493536176, 9493536504 నెంబర్లలో సంప్రదించాలన్నారు.

'అక్రమణలు తొలగించండి'

గుంతకల్లు: పట్టణంలోని సర్కిళ్లలో అక్రమణలను తొలింగించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జగదీష్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు సోమవారం అనంతపురంలో జరిగిన గ్రీవెన్స్‌లో ఇన్‌చార్జ్ కలెక్టర్ శివ్‌నారాయణ్‌శర్మకు వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ గుంతకల్లులోని ప్రధాన రహదారులు విశాలంగా లేకపోవడంతో తీవ్రమైన ట్రాఫిక్ సమస్యతో వాహనాదారులు ఇబ్బందులు పడుతున్నారు. పట్టణంలోని గాంధీచౌక్, ఎన్టీఆర్, పొట్టి శ్రీరాములు, బీరప్పగుడి సర్కిళ్లలో ఆక్రమణలకు గురై రోడ్డు కుంచిపోయిందన్నారు. అక్రమణలును తొలిగిస్తే కనీసం కొంత మేర ట్రాఫిక్ సమస్య పరిష్కరించవచ్చున్నారు.

గుండెపోటుతో న్యాయవాది మృతి


రామశర్మ(ఫైల్)

గుత్తి: పట్టణానికి చెందిన సీనియర్ న్యాయవాది రామశర్మ(61) గుండెపోటుతో సోమవారం రాత్రి మృతి చెందారురు. వివరాలు.. రామశర్మ ఇంటిలో కుప్పకూలి కిందపడడంతో కుటుంబ సభ్యులు వెంటనే స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. రామశర్మకు భార్య, కుమారుడు ఉన్నారు. ఈయన మృతి పట్ల బార్ అసోసియేషన్ సభ్యులు , న్యాయవాదులు సంతాపం ప్రకటించారు.